పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ
- తహసీల్దార్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 16 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయిస్తామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. బుధవారం పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కలెక్టర్ భూమిపూజ చేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని వంద ఏండ్లకు పైబడిన పురాతన భవనాలను పరిశీలించారు. వాటి స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి, లేదా ప్రభుత్వ ఆస్తుల సక్రమ వినియోగానికి చర్యలు తీసుకునేందుకు పూర్తి వివరాలతో సర్వే నంబర్ మ్యాపులతో ప్రభుత్వానికి సమర్పిస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారు బీసీ వసతి గృహాన్ని సందర్శించి బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహిళా శక్తి క్యాంటీన్‌ను, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ మాడల్ హౌస్‌ను సందర్శించారు. ఇందిరమ్మ ఇంటికి సంబంధించి బేస్‌మెంట్ నిర్మాణానికి లబ్ధిదారు మాల లక్ష్మికి రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూ భారతిపై అవగాహన సదస్సులు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, ఏప్రిల్ 16 : భూ భారతి చట్టంపై ఈ నెల 17 నుంచి 30వరకు ప్రతి మండల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టంలో నోటీసు విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. కొనుగోలు, అమ్మకం దారుడికి, మ్యుటేషన్ సందర్భంలో నోటీసు విధానాన్ని అమలు చేయాలన్నారు. నోటీసు అమలు చేసిన అనంతరం ఏమైనా అభ్యంతరాలు ఉంటే పలువురి వాదనలు విని పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పరిష్కరించాలన్నారు. వీటిలో హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండంచెలా అప్పీల్ వ్యవస్థ తదితర అంశాలు కీలకమన్నారు.

నోడల్ అధికారులుగా ఆర్డీవోలు

భూ భారతి చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సుల నోడల్ అధికారిగా స్థానిక ఆర్డీవోలు వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూయించేందుకు తీసుకొచ్చిన భూ భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వీటిలో రైతు సంఘాల నాయకులు, సభ్యులను ఈ సదస్సుల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలు ప్రజలకు అర్థమయ్యేలా కరపత్రం ముద్రించాలన్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్న మాదిరిగానే భూ ఆధార్ కార్డులు భూమి ఉన్న వారికి ప్రభుత్వం అందిస్తుందన్నారు. గ్రామాల్లో నేటి నుండి జరగబోయే అవగాహన సదస్సులు ప్రజలకు అర్థమయ్యేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆయా మండలాల్లో జరిగే అవగాహన సదస్సులకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- చైల్డ్ కేర్ వసతి గృహం తనిఖీ

స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (బాలుర) చైల్డ్ కేర్ వసతి గృహ విద్యార్థులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 16 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వికారాబాద్‌అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ధన్నారం సమీపంలో ఉన్న స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (బాలుర) చైల్డ్ కేర్ వసతి గృహాన్ని సెమీ అర్బన్ జిల్లా నివేదిక కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జయసుధతో కలిసి రికార్డులను పరిశీలించారు. డార్మెంటరీ, వాష్ రూమ్‌లను పరిశీలించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా తదితర వివరాలు వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు, విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా మెనూ పాటించాలని సూచించారు. ప్రతి నెలా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని వార్డెన్లను ఆదేశించారు. ఆయన వెంట సీడబ్ల్యూసీ సభ్యులు ఉన్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేశ్

దోమ, ఏప్రిల్ 16 : దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేంత వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేశ్, జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో దోమ మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సుక్కయ్య అధ్యక్షత నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామైన కొండారెడ్డిపల్లి నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం వరకు వందలాది మంది దివ్యాంగులతో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచుతామని మొండి చేయి చూపించారన్నారు. మాయ మాటలతో నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ సమస్యలను పరిష్కరించకుండా దివ్యాంగ సమాజాన్ని చిన్నచూపు చూస్తున్నదని మండిపడ్డారు. శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న క్రమంలో అక్రమ అరెస్టులు చేస్తూ నిర్బంధాలను కొనసాగించాలని చూస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదయ్య బాబు, యువజన విభాగం నాయకుడు గుంటి శివకుమార్, దోమ మండల యూత్ అధ్యక్షుడు మహేశ్, మండల నాయకులు ఆరూరిబాబు, చిన్న వెంకన్న, పెద్ద వెంకన్న, శ్రీరాములు, లింగయ్య, గోపయ్య, జక్కుల నర్సమ్మ, బీరెల్లి కలమ్మ, గోగుల కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

విద్యార్థినికి తీవ్రగాయాలు.. దవాఖానకు తరలింపు

విద్యార్థికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజశేఖర్ రెడ్డి

ధారూరు, ఏప్రిల్ 16 : ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలో పైకప్పు పెచ్చులూడి కింద పడడంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మున్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పాఠశాలలో ఒకటో తరగతి గదిలో ఉదయం ప్రమాదవశాత్తు పైకప్పు పెచ్చులూడి కింద పడడంతో విద్యార్థిని శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ఉపాధ్యాయురాలు వెంటనే బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వికారాబాద్‌లోని దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. పెచ్చులూడి కింద పడిన సమయంలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. మిగతా ఐదు గురికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయమై డీఈవో రేణుకాదేవి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే దవాఖానకు వచ్చి విద్యార్థినితో మాట్లాడారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను పాతవి, మరమ్మతుల్లో ఉన్న గదుల్లో కూర్చోబెట్టరాదని సూచించారు. ఆమె వెంట పీఈటీయూ అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, యూనియన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, డీఈ, ఏఈలు ఉన్నారు.

మున్నూర్ సోమారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఊడిన పైకప్పును పరిశీలిస్తున్న డీఈవో రేణుకాదేవి, డీఈ, ఏఈలు

హోటళ్లలో తప్పనిసరిగా శుభ్రత పాటించాలి

ఎంజీ ఫుడ్ కోర్టును పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 16 : హోటళ్లలో శుభ్రతతో పాటు నాణ్యత పాటించాలని చేవెళ్ల మున్సిపల్ మేనేజర్ రాఘవేందర్ సూచించారు. చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ ఆదేశాల మేరకు బుధవారం షాబాద్ చౌరస్తాలో ఉన్న ఎంజీ ఫుడ్ కోర్టును మున్సిపల్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. కుళ్లిపోయిన చికెన్, గుడ్లు, ఫ్రిజ్జిలో దుర్వాసనతో పాటు శుభ్రంగా లేకపోవడంతో రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోటళ్లలో వండే పదార్థాలు నాణ్యతగా లేకపోతే కస్టమర్లు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. శుభ్రతో పాటు నాణ్యత పాటించని పక్షంలో ఆ హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, టౌన్ ప్లానింగ్ అధికారి అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణిపై వేటు

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కలెక్టర్ చర్యలు
- ఆమె బాధ్యతలు వేరే అధికారిణికి అప్పగింత

ఆదిబట్ల, ఏప్రిల్ 16 : కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రంగారెడ్డి జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సంధ్యారాణిపై వేటుపడింది. బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆమెను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె బాధ్యతలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న శ్రీలతకు అప్పగించారు.

స్పోర్ట్ కిట్స్ ఇంకా అందలే

యువతకు క్రీడా సామగ్రి పంపిణీలో బల్దియా క్రీడావిభాగం అలసత్వం

అధికారుల తీరుపై మండిపడుతున్న కార్పొరేటర్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): చిన్నారులతో పాటు యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించడంపై జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యపు ధోరణిని అవలంభిస్తున్నది. వేసవి కంటే ముందే ప్రతి డివిజన్‌కు రూ. 2 లక్షల క్రీడా సామగ్రికి సంబంధిత కార్పొరేటర్లకు అందజేయాలని ఐదు నెలల క్రితం జీహెచ్ ఎంసీ నిర్ణయించింది. మేయర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో రూ. మూడు కోట్లతో క్రికెట్, షటిల్, బ్యాట్మింటన్, క్యారమ్, చెస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, స్కేటింగ్, టెన్నీస్, టెబుల్ టెన్నీస్ తదితర క్రీడా సామగ్రిని సంబంధిత కార్పొరేటర్లను అందజేయాలని నిర్ణయించారు. 150 డివిజన్లకు గానూ రూ. రెండు లక్షల చొప్పున క్రీడా సామగ్రి పంపిణీకి ఏజెన్సీని ఖరారు చేసిన స్పోర్ట్స్ విభాగం అధికారులు తదనంతరం క్రీడా కిట్ల పంపిణీలో మాత్రం జాప్యం చేశారు. తాజాగా హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికల కోడ్ రావడంతో ఈ పంపిణీ ప్రక్రియ నిలిపివేశారు. ఈ నెల 26 తర్వాతనే ఆయా కార్పొరేటర్లకు క్రీడా సామగ్రిని అందజేస్తామని స్పోర్ట్స్ విభాగం అధికారులు తెలిపారు.

భాషా సాహిత్యానికి రామరాజు కృషి ఎనలేనిది

తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు నిత్యానందరావు



సారస్వత వ్యాసాల సంపుటిని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 16: తెలుగు, సంస్కృత భాషా సాహిత్యం, జానపద సంపదకు ఆచార్య బిరుదురాజు రామరాజు చేసిన కృషి చిరస్మరణీయమని తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి సభ బుధవారం జరిగింది. భాషా నిలయం గౌరవ అధ్యక్షులు టి. ఉడయవర్లు అధ్యక్షతన జరిగిన సభలో బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసముల పుస్తకం, శతజయంతి స్మారక సంచికను వక్తలు ఆవిష్కరించారు. తెలుగు వర్సిటీ వీసీ వెల్దండ నిత్యానందరావు, సాహిత్య అకాడమీ సంచాలకులు సి. మృణాళిని, ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ పాల్గొని రామరాజు సాహిత్య వ్యక్తిత్వాన్ని తమ ప్రసంగంలో ఆవిష్కరించారు. అనంతరం పాకనాటి జ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సులో రామరాజు సాహితీ యానంపై కంచి విజయలక్ష్మి, రామరాజు సాహిత్యోద్ధారణకు చేసిన కృషిపై సీహెచ్ లక్ష్మణచక్రవర్తి, జానపద వాఙ్మయోద్ధారణపై కె.పద్మావతి ప్రసంగించారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలుగు సాహిత్య వైతాళికులు రామారాజు అనే అంశంపై సంగిశెట్టి శ్రీనివాస్, ఆధ్యాత్మిక సాహిత్యంపై సాగి కమలాకరశర్మ, యక్షగాన పరిశోధనపై కాంచనపల్లి గోవర్ధన్‌రాజు ప్రసంగించారు. రామరాజు కుటుంబ సభ్యులు రఘునారాయణరాజు, యాదవరాజు, ప్రతాప్‌రాజు, అనిల్‌కుమార్, ఆదిత్య, రుక్మిణి, డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ రాజుతదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- ఊరెంటితండాలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, రెండు స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- మూడు గ్రామాల్లో అంధకారం

ఊరెంటి తండాలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, రెండు స్తంభాలు

పెద్దేముల్, ఏప్రిల్ 16 : మండల పరిధిలో బుధవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. వివరాలు.. మండల పరిధిలోని ఊరెంటి తండాలో సాయంత్రం గాలివాన బీభత్సానికి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు రెండు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఊరెంటి తండా, బాయిమీది తండా, తట్టేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం మరమ్మతులు చేయిస్తామని చెప్పారని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంతో మగ్గాల్సిందేనా అని ఆయా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

ఈదురుగాలులకు నేలరాలిన మామిడి

నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న అధికారి హిమబిందు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 16 : ఫరూఖ్‌నగర్ మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వడగండ్ల వాన, ఈదురు గాలులకు మామిడి రైతులు నష్టాలను చవిచూశారు. మండల పరిధిలోని దేవునిపల్లికి చెందిన రైతు అంజన్నకు సంబంధించి 40 ఎకరాల మామిడి తోటను శ్రీనివాస్‌గౌడ్ కౌలుకు తీసుకున్నాడు. అకాల వర్షానికి కాయలు నేల రాలాయని కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.6లక్షల నష్టం వాటిల్లిందన్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారి హిమబిందు పరిశీలించి నష్టపోయిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షానికి పంటలు నష్టపోతే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. నష్టపోయిన కౌలు రైతుకు ఆర్థిక సహాయం అందించాలంటూ గ్రామస్తులు, రైతులు కోరారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

నవాబుపేటలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు సదానందం, విశ్వనాథ్

నవాబుపేట, ఏప్రిల్ 16 : గాలికుంటు నివారణకు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని వికారాబాద్ జిల్లా పశువైద్యాధికారి సదానందం సూచించారు. బుధవారం నవాబుపేటలో స్థానిక పశువైద్యాధికారి విశ్వనాథ్‌తో కలిసి 30 పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పశు సంపదను పెంచాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల పశువైద్య సిబ్బంది మండల పరిధిలో పశుగణన చేపట్టి 5వేల పశువులు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. వీటి ఆధారంగా ఏక్‌మామిడి, యెల్లకొండ, నవాబుపేట పరిధిలో మూడు టీమ్‌లను ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేయిస్తున్నామని తెలిపారు. పశువుల కోసం గ్రాసాన్ని కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకాల కార్యక్రమం మే 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కనకారాణి, శ్రీరాములు గౌడ్, శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ అంచనాలు తలకిందులు

ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపించని నగరవాసులు

నెలాఖరుతో ముగియనున్న రాయితీ గడువు

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో ఎల్ఆర్ఎస్ అంచనాలు తప్పాయి. ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. సంస్థకు వచ్చిన 1,07,872 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 10,957 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకున్నారు. వారి ద్వారా రూ.136.30 కోట్లు ఆదాయం సమకూరింది. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.500 కోట్ల అదాయం వస్తుందని భావించిన అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. జోనల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం, దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి రుసుం చెల్లించాలని కోరినప్పటికీ లబ్ధిదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. కాగా ఈ నెలాఖరుతో 25 శాతం రాయితీ గడువు ముగియనుంది.

ఎంబీఏ కోర్సుల పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్) తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac. inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్.వై.డి. క్లినికల్ సైకాలజీ రెండు, మూడో సంవత్సరం రెగ్యులర్, బ్యాక్ లాగ్, ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ సెకండ్ పార్ట్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజును వచ్చే నెల 19వ తేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 2016-17 విద్యాసంవత్సరంతో పాటు ఆ తరువాత డిగ్రీ కోర్సుల్లో చేరిన వారు ఈ వన్ టైం చాన్స్ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులని వివరించారు. సాధారణ పరీక్ష ఫీజుతో పాటు ఒక్కో పేపర్‌కు రూ.2,000 చొప్పున అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac. inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యూయేషన్ కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ బీఈ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (సీబీసీఎస్) ఏఐసీటీఈ కోర్సులు, బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి రెండు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. ఈ రీవాల్యూయేషన్ కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 26వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 28వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు శిక్షణ

అడ్డగుట్ట, ఏప్రిల్ 16: అప్ప టెక్ మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు శిక్షణను అందిస్తున్నట్లు హిట్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపి బుధవారం ప్రకటనలో తెలిపారు. 20 -27 ఏండ్ల వయసున్న బీఎస్సీ, ఎమ్మెల్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకామ్, ఎంకామ్ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మెడికల్ కోడింగ్‌లో (మెడికల్ టెర్మినాలజీ, హ్యూమన్ అనాటమీ, పీసీయాలజీ, ఐసీడీ-10 సీపీటీ, హ